1993
నుండి
వెలువడుతున్నది

ఎలమి : కట్లాపి
(నందన : ఆషాఢం)

జూలై 2012

తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

●నుడి ●నాడు ●నెనరు

15 రూ.




## తెలుగువారి గొప్పచరిత్రకు ఆనవాళ్లు...

తందానతాన

# డికాంబరి ఆట



గుండు డికాంబరి ఆట ఆడుతున్న కళాకారుడు



కత్తుల డికాంబరీ కళాకారుడు

తెలుగు పల్లెకళల సంపద చాలా పెద్దది, ఎంతో పలుతనము (వైవిద్యము) కలది. తావు తావుకు ఒక్కొక్క తీరున తావిని వెద చల్లుతూ ఉంటాయి మన తెలుగు కళలు. ఇప్పటి తమిళనాడులో నూరుకుపైగా తెలుగు పల్లెకళలు ఉన్నాయి. అటువంటి వాటిలో డికాంబరి ఆట ఒకటి.

కృష్ణగిరి పెద్వంటెము డెంకణికోట వంటెములో మదగొండపల్లి అనే ఊరు ఉంది. హోసూరు నుంచి సుమారు 15 కి.మీ. దూరములో ఉంటుంది ఈ ఊరు. డికాంబరి ఆటకు పేరు పడిన ఊరు ఇది. ఈ ఊరులోని గజానన ఆచారి అనే కళాకారుడు హోసూరు బెంగుళూరు తావులలో గొప్పపేరు గడించిన డికాంబరి ఆటగాడు. వీరి కళారూపము డిల్లీ వరకూ పోయి వచ్చింది.

ఒకప్పుడు హోసూరు పల్లెలలో పండుగలకూ పరసల (తిరునాళ్ల)కూ డికాంబరి ఆట ఉండి తీరాల్సిందే. ఇప్పుడు కొంచెము ఆదరణ తగ్గినా పూర్తిగా కనుమరుగు కాలేదు ఈ కళ. డికాంబరి ఆట రెండు తీరులుగా ఉంటుంది. 1 గుండు డికాంబరి, 2 కత్తుల డికాంబరి. ఏ తీరు ఆటలో అయినా పులివేషగాళ్లు తప్పనిసరిగా ఉంటారు. పలకలు (డప్పులు), కొలువు(సన్నాయి) కూడా తప్పనిసరి.

గుండుడికాంబరి:- రెండు మూరల పొడుగు ఉండే ఇనుప గొలుసుకు ఒక కొనన సుమారు పది కిలోల బరువు ఉండే ఇనుప గుండు ఉంటుది. ఆ గొలుసు మరొక కొనను కళాకారుడు తన కాలి మడమ దగ్గర కట్టుకొంటాడు. పలుచని రేకులతో చేసి, వన్నెలకాగితాలతో అలంకరించిన, సుమారు పదికిలోల బరువు ఉండే కిరీటాన్ని తలమీద పెట్టుకొంటాడు. ఎడమ చేతిలో విల్లంబులు, కుడిచేతిలో వన్నెల బట్ట పట్టుకొని, పలకలూ కొలువూ మోగుతా ఉంటే కునుస్తాడు (చిందువేస్తాడు). ఆటగాడితో పాటు ఇనుపగుండు కూడా గిరగిర తిరుగుతా ఉంటుంది. చాలా మెలకువతో ఆడాల్సిన ఆట ఇది. కొంచెము ఏమరపాటుగా ఉన్నా ఇనుపగుండు వచ్చి గుద్దుకొంటుంది.

కొంచెము సేపు డికాంబరి ఆడిన తరువాత, ఆటగాడు ఊపిరి తీసుకొనేకి పక్కకు పోతాడు. అప్పుడు ఇద్దరు పులివేషగాళ్లు వచ్చి పోటాపోటీగా కునుస్తారు. కాసేపు ఊపిరి తీసుకున్న డికాంబరి ఆటగాడు తిరిగి బరిలోకి వస్తాడు. ఇట్లా సాగిపోతా ఉంటుంది ఈ ఆట.

కత్తుల డికాంబరి :- ఈ ఆటగాడు ఒళ్లంతా ఎరుపు వన్నెను పూసుకొని, బారడు పొడుగు ఉండే మూడు కత్తులను నిలువుగా వీపుకు కట్టుకొని, తలపాగా చుట్టుకొని ఉంటాడు. చేతుల్లో రెండు చురకత్తులను పట్టుకొని ఉంటాడు. నడుము దట్టీకి వెనుక నాలుగు అయిదు అడుగుల పొడుగు ఉండే పగ్గము తోకలాగా వేలాడుతా ఉంటుంది. ఆ తోకను ఇంకొక అతను పట్టుకొని ఉంటాడు. డికాంబరి ఆటగాడు కునుస్తానే తన తోకను పట్టుకొని ఉండే వాడిని పట్టుకోవాలని పోతాడు. అతను ఈ ఆటగాడికి చిక్కకుండా ఆటగాడి వెనుకనే పరుగులు తీస్తా ఉంటాడు. పలకలూ కొలువూ మోతల నడుమ ఈ ఆట సాగుతుంటుంది.

ఈ కళ కనుమరుగు కాకూడదు అని, ఆదరణ తక్కువ అవుతున్నా లెక్కచేయకుండా, ఐఐటి చదువుతున్న తన మనుమడు అయిన యశ్వంతుకు ఆటను నేరిపించినాడు గజానన ఆచారి. కోడె ఈడు వాడయిన యశ్వంతు, ఎంతో నేర్పు ఉన్న గజానన ఆచారి ఇప్పుడు పోటీ పడి ఆడుతున్నారు. ఈ తాతా మనుమళ్ల డికాంబరి ఆటకు హోసూరు పల్లెలు పులకరిస్తా ఉండాయి.

**- పూతలపట్టు రఘునాథరెడ్డి,** హోసూరు

మన వారసత్వ సంపద

# నాయకురాలు నాగమ్మ దేవాలయం



**నాయకురాలు నాగమ్మ నిర్మించిన - ఇప్పుడు శిథిలావస్థలో ఉన్న - యీ చెన్నమల్లికార్జునాలయాన్ని ఇటీవలే పురావస్తు శాఖ రక్షిత కట్టడంగా ప్రకటించి 13వ ఆర్థిక సంఘం నుంచి 30 లక్షల నిధులను మంజూరు చేసింది. చుట్టూ తవ్వకాలు జరిపి, ఈ ఆలయాన్ని ఊడదీసి పునర్నిర్మిస్తే మరుగున పడిన మనవారసత్వాన్ని తరువాతి తరానికి అందించిన వారమౌతాము.**

పల్నాటినాయకురాలిగా, ధీరవీరవనితగా, తొలిమహిళా మంత్రిణిగా పేరుగాంచిన నాగమ్మ మధ్యయుగపు తెలుగు వారి చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకొంది. కరీంనగర్‌జిల్లా ఆర్వేల్లిలో పుట్టిందనీ తండ్రి చౌదరి రామిరెడ్డి (అరి అంటే పన్ను, చాత్ అరి అంటే పండిన పంటలో, వచ్చిన ఆదాయంలోనాలుగోవంతు పన్నును వసూలు చేసే అధికారం పొందినవారిని చౌదరి అని పిలిచేవారు. అంతేకాని ఇదికులానికి సంబంధించిన పదంకాదు!) గురజాల ప్రాంతానికొచ్చి జిట్టగామాలపాడులో నివాసమేర్పరచుకొని, వ్యవసాయం చేసుకొంటూ బతికాడని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. బావమరిది మేకపోతుల జగ్గారెడ్డి సహకారంతోఅక్కడే స్థిరపడిపోయాడు చౌదరి రామిరెడ్డి. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకొన్న నాగమ్మను ఎలాగైనా ప్రయోజకురాల్ని చేద్దామనుకొని, గోపన్న మంత్రి ఆధ్వర్యంలో మామూలు చదువులతోపాటు బాణాలు ఎక్కు పెట్టడం, గుర్రపు స్వారీ, యుద్ధవిద్యల్లో తర్ఫీదునిప్పించడమేకాక, తమిళ, కన్నడ, సంస్కృత, తెలుగు భాషలను, రాజనీతి తత్వశాస్త్రాలను కూడా నేర్పించారు చౌదరి రామిరెడ్డి.

అన్ని విద్యలనూ నేర్పించి, మేటిగా తీర్చిదిద్దిన గోపన్న మంత్రి శివారాధకుడు. ఆయన ప్రభావంతో నాగమ్మకూడా శైవమతంపట్ల ఆకర్షింపబడింది. తన ప్రత్యర్థిబ్రహ్మనాయుడు వైష్ణవుడు కావడంతో, శివునిపై మరింత మక్కువ పెంచుకొంది. ప్రతిరోజూ శివపూజకు కొంత సమయం వెచ్చించేది. శివుని నమ్మిన నాగమ్మ పరమత సహనాన్ని కూడా పాటించింది. ఇతర మతాలపట్ల ఏ మాత్రం ద్వేషభావాన్ని ప్రదర్శించిన ఆధారాలులేవు!

నాగమ్మకు, చౌదరిరామిరెడ్డి మేనల్లుడైన సింగారెడ్డితోవివాహం జరిగింది. పొంచివున్న దురదృష్టం కాళ్ళపారాణి ఆరకముందే సింగారెడ్డిని బలితీసుకుంది. మరోవైపు కన్న తండ్రిని బ్రహ్మనాయుడు దుర్మార్గపు ఆలోచనతో హతమారుస్తాడు. విధిబలీయమైందని తెలుసుకొని, ఉన్నంతలో మనసును కుదుటపరచుకొని శక్తియుక్తుల్ని కూడదీసుకొని కాలం వెళ్ళబుచ్చుతున్న నాగమ్మ, అడవుల్లో వేటకెళ్ళి అలసిపోయిన అనుగురాజుకు, అనుచరులకు ఆతిథ్యమివ్వటాన, అనుగురాజు మెచ్చుకొని, నాగమ్మను వరం కోరుకోమనగా, మంత్రి పదవి నాశించిన నాగమ్మకోరికను అనుగురాజు తీరుస్తాడు. మహామంత్రిగాఅసమాన ప్రతిభాపాటవాలతో ఎత్తుకుపై ఎత్తువేసి కుటిల రాజకీయాల్ని పటాపంచలు చేసి నిజమైన నాయకురాలనిపించుకొంది.

అంతటి ఆలోచనా పరురాలు రాజనీతిజ్ఞురాలు, ప్రజా సంక్షేమానికి పెద్దపీటేసి అందరికీ ఆదర్శంగా నిలచిన నాయకురాలని గుర్తుంచుకోవడానికి కుల, మతాలకు అతీతంగా ఆడపిల్లల పేర్లు ఇప్పటికీ నాయకమ్మఅనీ, నాయకాంబఅనీ, నాగమ్మఅనీపెట్టుకొంటూనే ఉన్నారు.

తాను శైవాన్ని నమ్మినా, గురజాలలోని పాతపాటేశ్వరిని పూజించటమేకాక దాచేపల్లిలో రంగనాయకునికి ఒక ఆలయాన్ని నిర్మించింది. తాను పుట్టి పెరిగిన జిట్టగామాలపాడులో మల్లికార్జునాలయం నిర్మించింది. బ్రాహ్మనాయుడు మాచర్లలోచెన్న కేశవాలయాన్ని నిర్మిస్తే నాయకురాలు నిర్మించిన శివాలయానికి చెన్నమల్లికార్జునాలయమని పేరు పెట్టింది. (చెన్న అంటే అందమైన, చక్కనైన అని అర్థం).

దాచేపల్లికి 3 కిలోమీటర్లదూరంలోగల గామాలపాడుకు తూర్పుగా ఒక కి.మీ.దూరంలో జిట్టగామాలపాడు శిథిలాలున్నాయి. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఒక కోటగోడ, దానిలో ఉత్తరంవైపు ఒక శిథిలశివాలయం కనపడతాయి. ఈశివాలయమే నాయకురాలు నాగమ్మ నిర్మించిన చెన్నమల్లికార్జునాలయం. స్థానికంగా దొరికే మాచర్ల నాపరాతితో, గర్భాలయం, అర్థమండప, మహామండపం (ప్రస్తుతం లేదు)తో నున్న ఈ ఆలయం, అధిష్ఠానం, పాదవర్గం, ప్రస్తరం, దానిపై నాలుగు అంతస్తుల నాగరవిమానం, గర్భాలయం ముందునుంచి, అర్థమండపంపై వరకూ నిర్మించిన శుకనాసి, కళ్యాణీ చాళుక్యవాస్తును తలపిస్తుంది. క్రీ.శ. 12వ శతాబ్దిలో ఇంకా కాకతీయ ఆలయ వాస్తుశైలి రూపుదిద్దుకోలేదు. అప్పటివరకూ ఆచరణలోనున్న కళ్యాణీ చాళుక్య వాస్తు సంప్రదాయంలోనే నాగమ్మ ఆలయాన్ని నిర్మించింది. అధిష్ఠానంవరకూ మట్టిలో మునిగిన ఈ ఆలయం గోడలపై సన్నటి, పొడవాటి స్తంభాలు వన్నె తెచ్చాయి. చిన్న కపోతం, దానిపైన ప్రతివర్గం, దానిపై నాలుగు అంతస్తులు ఆనాటి శిల్పుల పనితనానికి అద్దం పడుతున్నాయి. అర్థమండపంగోడలకు రెండువైపులా కోష్ఠాలు, రాష్ట్ర కూటుల శైలిని ప్రతిబింబిస్తున్నాయి.

గర్భాలయ ద్వారశాఖలపై చక్కటి శిల్పం, విరిగిననంది, పగిలిన భైరవ విగ్రహం సందర్శకులకు ఒక పక్క ఆనందం, మరోపక్క దుఃఖం ఒకేసారి అనుభవంలోకొస్తాయి. రాబర్ట్‌సివెల్, బియఎల్ హనుమంతరావు. స్వర్ణ వాచస్పతి, వైహెచ్‌కె మోహన్‌రావులు తమతమ రచనల్లో ఈఆలయాన్ని గురించి ప్రస్తావించినా ఎక్కువమందికి తెలియని మాటనిజం. అర్థమండపం ముందు పైభాగాన 'చెన్నమల్లికార్జునాలయమ'న్న శాసనముంది. నాయకురాలు నాగమ్మ నిర్మించిన - ఇప్పుడు శిథిలావస్థలోఉన్న- యీ చెన్నమల్లికార్జునా లయాన్ని ఇటీవలే పురావస్తు శాఖ రక్షిత కట్టడంగా ప్రకటించి 13వ ఆర్థిక సంఘం నుంచి 30 లక్షల నిధులను మంజూరు చేసింది. చుట్టూ తవ్వకాలు జరిపి, ఈ ఆలయాన్ని ఊడదీసి పునర్నిర్మిస్తే మరుగున పడిన మనవారసత్వాన్ని తరువాతి తరానికి అందించిన వారమౌతాము. జంగాకృష్ణమూర్తి, టీజీవీకృష్ణారెడ్డి, ప్రొ॥ పి. చెన్నారెడ్డిలకు కృతజ్ఞతలు.

**- ఈమని శివనాగిరెడ్డి,** హైదరాబాదు, ఫోన్: 9848598446

సంపాదకీయం

# అంత పెద్దలకు ఇంత చిన్న బుద్ధులుండదగునా?

“అర్ధశతాబ్దికి పూర్వమే, జీవద్భాషానుశీలనకు, నిగూఢ విషయావిష్కరణకు, నవీనశాస్త్ర విస్తరణకు హృదయాన్ని మీదు గట్టినవారు భద్రిరాజు కృష్ణమూర్తి గారు. గాఢతలో కాని, విస్తృతిలో కాని విషయ వైవిధ్యంలోకాని పూర్వపండితుల్లో ఏ ఒక్కరివల్లా కానంత సమగ్రకృషి ఒకచేతి మీదుగా జరగడం ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం.”

‘సామాజిక భాషాశాస్త్ర రంగంలో కృష్ణమూర్తిమత్వం చాలా ఉన్నతమయినది...’ ‘గత శతాబ్దిలో వర్ధిల్లిన దేశవిదేశాల్లో గొప్ప పేరుప్రఖ్యాతులు గడించిన భాషాశాస్త్రవేత్తల్లో సునీతికుమార ఛటర్జీ గారి తర్వాత చెప్పుకోదగ్గవారు భద్రిరాజు కృష్ణమూర్తి గారు ఒక్కరే.’

- ఈ మాటలు నడుస్తున్న చరిత్ర అక్టోబర్ 2005 సంచికలో ప్రచురించిన పోరంకి దక్షిణామూర్తి గారి వ్యాసంలోనివి. భద్రిరాజు గారి తెలుగుభాషా సేవను, ఔన్నత్యాన్ని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించిన ఈ వ్యాసం అప్పుడు పత్రిక గౌరవసంపాదకులుగా, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులుగా ఉన్న సి. ధర్మారావు గారి నుండి మాకు అందగా ఎంతో ఆనందంగా దాన్ని పత్రికలో ప్రచురించాం. ఆ వ్యాసంలో రచయిత వ్రాసినదంతా వాస్తవం. భద్రిరాజు కృష్ణమూర్తి గారంతటి గొప్ప భాషాశాస్త్రజ్ఞునికి జాతీయస్థాయిలో అందవలసినంత గౌరవం ప్రభుత్వం నుంచి ఇంకా అందలేదని నడుస్తున్న చరిత్ర భావిస్తున్నది. తెలుగు అధ్యాపకులు, విద్యార్థులు, పండితులు, తెలుగు భాషోద్యమకారులు - ఆ మాటకువస్తే - మొత్తం తెలుగు ప్రజలు గర్వించదగిన సమున్నత భాషాకోవిదుడు భద్రిరాజు కృష్ణమూర్తి గారు.

ఇంతటి గొప్పవ్యక్తి ‘నిన్ను చూడాలనుకుంటున్నారు. నిన్ను బాగా మెచ్చుకొంటున్నారు. హైదరాబాదుకు ఎప్పుడొస్తావంటూ’ మూడుసార్లు సి. ధర్మారావు గారు మన పత్రిక రచయిత స.వెం.రమేశ్‌కు ఫోన్‌చేసి రప్పించారు. వారూ, పోరంకి దక్షిణామూర్తి గారూ కలిసి - మే2న - అతనిని వెంటపెట్టుకొని భద్రిరాజు వారింటికి తీసుకువెళ్లారు. ఆ తర్వాత ఏం జరిగిందీ - జూన్ సంచికలో - ‘నుడి పెంపుతీరుపై చర్చ జరగాలి’ అన్న వ్యాసంలో రమేశ్ వివరించాడు. ఆ వ్యాసం తెలుగు భాషాభిమానుల్లో, విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో, భాషోద్యమకారుల్లో కలకలం రేపింది. తనకు జరిగిన అవమానాన్ని క్లుప్తంగానే తెలియజేసిన స.వెం.రమేశ్ - భద్రిరాజు గారూ, ఆయనకు తోడుగా వంతపాడుతూ ఎకసెక్కెం చేసిన పోరంకి గారూ తప్పుపట్టినవాటినీ, ఇంతవరకూ తాను నుడిపెంపుదల విషయంలో చేసిన కృషినీ వివరించాడు ఆ వ్యాసంలో. దానిమీద స్పందించవలసిన నైతిక బాధ్యత వారివురిమీద ఉంది. (ధర్మారావు గారు మరో ధర్మరాజే. ఈ యువకుడు చేసేపనిలో తప్పులుంటే సవరించి, ముమ్మందు చేయగల పనికి దారిచూపి సహకరిస్తారేమోననే మంచి ఉద్దేశ్యంతో ఆయన చొరవ తీసుకొని, ఎక్కడో తమిళనాడులో గ్రామాల్లో పర్యటిస్తున్నవాడిని హైదరాబాదుకు పిలిచి, ఆదరంగా పెద్దాయన ఇంటికి తీసుకువెళ్లారు. కాని, జరిగినదంతా చూచి ఆయనా నొచ్చుకొన్నారు.)

80 ఏళ్లు దాటిన జ్ఞాన, వయోవృద్ధుడు మాట్లాడిన తీరుకు, తనపట్ల చూపిన చులకనకు రమేశ్ ఖిన్నుడయ్యాడు. ఎంతో గౌరవంతో ‘నుడిలో మీరు హిమాలయమంత అయితే నేను గరికపోచను. తప్పులుంటే సరిదిద్దమని’ అంటే అందుకు వారి స్పందన - ఈసడింపు. ‘నీకేమీ తెలియదు. నిన్ను సరిదిద్దేదేమిటి?’ అని ఎగతాళి! ఇదేనా పెద్దరికం? ఇదేనా ఆచార్యత్వం? మీ వయస్సులో సగం కంటే తక్కువ, భాషారంగంలో మీ అనుభవం కంటె తక్కువ వయస్సు తనది. మీ నుండి పిలుపురావడంతోటే ఎంతో గౌరవంతో, తానుచేస్తున్న కృషికి తోడ్పాటో, దిద్దుబాటో, ఆదరణో, అశీస్సులో అభిస్తాయని ఆశించి, ఎంతో వినయంగా మీవద్దకు వచ్చిన భాషోద్యమకారుడు స.వెం. రమేశ్. నేటి తమిళనాడుకు చెందిన నాటి దక్షిణాంధ్ర భూభాగంలో పుట్టి, స్వంతంగా తెలుగు చదువుకొని, కథారచయితగా పేరుగాంచిన రమేశ్ మద్రాసులో విశ్వవిద్యాలయ స్థాయిలో మానవశాస్త్రాన్ని(ఆంత్రోపాలజీ)ని చదువుకొని, తెలుగుభాషకు, తెలుగుజాతి సేవకు జీవితాన్ని అంకితం చేసుకొని పనిచేస్తున్నవాడు. స్థానిక ప్రజలను కూడగట్టుకొని ఉద్యమించి కృష్ణగిరి జిల్లాలో వందలాది తెలుగు పాఠశాలలను నిలబెట్టినవాడు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలోని గ్రామాల్లో తిరిగి అనేక జానపద కళాకారులను కలిసి అవన్నీ తెలుగు కళలేనని నిరూపించినవాడు. వారిలోంచి వందలాది తెలుగు మాటలను వెలికితెచ్చినవాడు స.వెం. రమేశ్. నిరంతరం క్షేత్రస్థాయిలో తిరుగుతూ పలువిధాల తెలుగుకోసం పనిచేయడమేగాక, తమిళనాడులో వందలాది గ్రామాల్లో వేలాదిమంది - తెలుగు నేర్వని తెలుగువారికి తెలుగు రాయడం, చదవడం నేర్పించినవాడతను. తెలుగు భాషోద్యమకారుల, అనేకమంది తెలుగు అధ్యాపకుల ఆదరాభిమానాల్ని పొందినవాడు. నడుస్తున్న చరిత్రను చదివేవారికి ఎవరికైనా అతని కృషి తెల్లమవుతుంది. భద్రిరాజు వారికీ,

సంపాదకీయం

పోరంకి వారికీ ఇదంతా తెలియదని అనుకోము. అయినా వారు అతని పట్ల అంతటి నిరాదరణ చూపడమేమిటో మాకు ఎంత ఆలోచించినా తోచడంలేదు.

గంటసేపు కసరుమాటలాడి, ఈసడించుకొని, వెక్కిరించిన తర్వాత అతనివంక చూపుడు వ్రేలు చూపుతూ 'నువ్వు రాయడము మానెయ్. ఈ పత్రికలో(నడుస్తున్న చరిత్రను చూపుతూ) రాయడము మానెయ్. అప్పుడే బాగుపడతావు' అని భద్రిరాజు గారు అన్నారట. ఇదేం బెదిరింపు?! ఇదేం ఆదేశం?! అంతటి పెద్దాయన ఇంతటి చిన్నబుద్ధిని ప్రదర్శించడమా?!

'నడుస్తున్న చరిత్ర' అంటే ఆయనకెందుకంత కోపం? తెలుగుభాషకు, జాతికి చేతనైన సేవచేయడం కోసమే కట్టుబడి పనిచేస్తున్న పత్రికపై ఎందుకంత అక్కసు? 2005 అక్టోబరులో వారి గురించి ఎంతో ఆనందంతో ప్రచురించిన పత్రికనే గదూ వారు ఈసడించుకొంటున్నది! అయితే, వారితో యీ పత్రికకు యిది కొత్త అనుభవంకాదు. ప్రాచీన భాషాప్రతిపత్తి కోసం ఉద్యమం జరుగుతున్న సందర్భంగా జి.వి. పూర్ణచందూ, మరికొందరూ వ్రాసిన వ్యాసాలను ప్రచురించినపుడు కూడా ఆయన ఈ ఏహ్యాభావాన్ని ప్రదర్శించారు. 2008 ఫిబ్రవరిలో విజయవాడలో జరిగిన సదస్సు ప్రారంభోపన్యాసంలో (మార్చి 2008 సంచికలో పూర్తి ప్రసంగం ఉంది) కూడా ఎంత పాండిత్యాన్ని, నిపుణతను ప్రదర్శించారో అంతటి తామస ప్రవృత్తిని ప్రదర్శించారు. పాండిత్యంతో పాటు సహనశీలత పెరిగివుండాలి గాని ఇంత దిగజారిపోకూడదు.

ఇదంతా అలా ఉంచండి. ఏమైనా, భద్రిరాజు కృష్ణమూర్తి గారు గొప్ప భాషాశాస్త్రవేత్త. దీన్నెవరూ కాదనలేరు. సామాజిక భాషాశాస్త్రరంగంలో తెలుగుకు సంబంధించి ఆయన గొప్పసేవలే అందించారు. ప్రభుత్వానికి తెలుగుపట్ల శ్రద్ధలేకపోవడంవల్లనేమి, వ్యవస్థల అసమర్ధతవల్లనైతేనేమి, తెలుగుకు ఎన్నో కష్టాలొచ్చిపడ్డాయి. మరి, కాలంతోపాటు తెలుగును ఎదిగించవలసిన భాషాశాస్త్రజ్ఞులు చేస్తున్నపని ఏమిటి? శాస్త్రసాంకేతిక అవసరాలకు సంస్కృతాన్నో మరొక భాషనో ఆధారం చేసుకోకుండా తెలుగు కుదురులనుండి మాటల్ని ఎందుకు పొందించలేకపోతున్నారు? కావ్యాల్లో ఇతర సాహిత్యంలో సంస్కృతాన్ని దిగుమతి చేశారు గనుక, ఈ ఆధునిక కాలంలోని అవసరాలకు కూడా ప్రజలభాషను, దాని మూలాల్నీ మనం అశ్రద్ధ చెయ్యాలా? నేటి కొత్తతరం అడుగుతున్నది ఇదే. మేం చదువుతున్నది తెలుగునేనా? అని వారు అడుగుతున్నారు. పాఠశాల విద్య నుండి ఉన్నత విద్య వరకూ అన్నింటా తెలుగును ఎందుకు ఎదిగించలేకపోతున్నారు? స.వెం. రమేశ్ గాని, ఒట్ర పురుసోత్తం వంటి మరికొందరుగాని తెలుగు కుదుర్ల నుండే పదాలను చూపుతున్నందుకు మీకు కోపం ఎందుకు రావాలి? సంస్కృతం, ఇంగ్లీష్, ఉర్దూ మాటలకు బదులుగా తెలుగు మాటలను సుమారు 200 వరకు రమేశ్ సూచించాడు. వాటిలో కొత్తగా రూపొందినవి 26 మాత్రమే. తక్కినవన్నీ ప్రజల్లో వాడుకలో ఉన్నవో, నిఘంటువులలోనివో, పాత గ్రంథాలలో వాడినవో ఇచ్చారు. ఇందుకు ఇంత ఉలికిపాటు ఎందుకు?

సంస్కృతంతో సహా ఏ ఒక్క నుడినీ స.వెం. రమేశ్ గాని, నడుస్తున్న చరిత్ర గానీ వ్యతిరేకించడంలేదు. కాని, తెలుగువారిగా మనం మన తెలుగు కుదుర్ల నుంచే మాటల్ని పొందించుకోవాలంటున్నాము. తెలుగును తక్కువచూపు చూడవద్దంటున్నాము. అక్కరలేని చోట్ల కూడా పరాయి నుడిని తెచ్చిపెట్టవద్దంటున్నాము. ఇతర నుడుల నుంచి తప్పనిసరై మాటలను తెచ్చుకోవలసినప్పుడు వాటిని మన నుడితీరుకు అనువుగానే తీసుకోవాలంటున్నాము. ఇది శాస్త్రీయ దృక్పథం కాదా? చర్చ జరగాలి.

కాలం మారింది, మారుతున్నది. ప్రశ్నించే స్వభావం పెరుగుతున్నది. నేటితరం తెలుగు బిడ్డలు తమ తల్లిభాషకు ఎందుకు దూరమవుతున్నామో ఆలోచిస్తున్నారు. చదువుతున్న యువతలో ఈ ఆలోచన పెరుగుతున్నది. తెలుగుజాతి, తెలుగు నుడీ ప్రాచీనమే కాదు, గొప్పవికూడా అని, ఎన్నోతరాలుగా తనవారిచేతనే తెలుగు వంచింపబడుతూ ఉన్నదనే ఆలోచనతో వారిలో కదలిక కలుగుతున్నది. నెమ్మదిగానైనా ఇది గొప్ప మార్పుకు దారి తీయబోతున్నది. స.వెం.రమేశ్ అలాంటి తరానికి ప్రతినిధి మాత్రమే. ఇలాంటివారు మరెందరో ముందుకు రాబోతున్నారు. ఈ దశలో గౌరవనీయులైన భద్రిరాజు కృష్ణమూర్తి గారి వంటి పెద్దలు పెద్దమనసు చేసుకొని, వారిని ఆదరించాలి. ప్రేమగా చూడాలి. తప్పులను సరిదిద్దాలి. మరింత ముందుకు దారిచూపాలి. అప్పుడే వారి పెద్దరికం నిలబడుతుంది.

**01-07-2012**

సామల రమేష్ బాబు

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=974**

* * *

**Read old issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=60**